గురుకులం పిలుస్తోంది..

- బొమ్మూరు అంబేడ్కర్ పాఠశాల, కళాశాలలో బాలికలకు అవకాశం
- ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 23 వరకూ గడువు, వచ్చే నెల 10న ప్రవేశ పరీక్ష


బొమ్మూరులో అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల

రాజమహేంద్రవరం రూరల్: చదువుపై ఆసక్తి ఉన్న వారికి గురుకులాలు సువర్ణావకాశం కల్పిస్తున్నాయి. ఇక్కడ ఉచిత వసతి సౌకర్యంతో ఉత్తమ విద్యను అందుకోవచ్చు. పేద, మధ్యతరగతి వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలల్లో 2024–2025 విద్యాసంవత్సరానికి ఐదో తరగతి, జూనియర్ ఇంటర్ (ఎంపీసీ, బైపీసీ) ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు సాంఘిక సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. దరఖాస్తులకు ఈ నెల 23వ తేదీ తుది గడువు. వచ్చే నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో ప్రవేశం దక్కితే ఇంటర్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు. నీట్/ఐఐటీల ప్రవేశాలకు సిలబస్‌తో పాటే శిక్షణ ఉంటుంది.

ప్రత్యేకతలు ఇవే..

- విద్యార్థులకు మెరుగైన విద్య, నిత్య పర్యవేక్షణ
- ప్రభుత్వ మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనం
- అన్ని సౌకర్యాలతో కూడిన వసతి గృహం
- నిబంధనలు మేరకు అమ్మ ఒడి పథకం
- జగనన్న విద్యాకానుక (పాఠశాల విద్యార్థులకు)
- నాలుగు జతల యూనిఫామ్, పీటీ డ్రెస్
- కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిషులో శిక్షణ
- నిబంధనలకు లోబడి అన్ని ప్రభుత్వ పథకాల వర్తింపు
- వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌లో శిక్షణ
- అటల్ టింకరింగ్ ద్వారా ఆధునిక సాంకేతిక అంశాలలో శిక్షణ
- చదువుతో పాటు అన్ని రంగాలలో తీర్చిదిద్దడం
- ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా క్రాఫ్ట్స్ తయారీలో శిక్షణ
- ఎంసెట్, నీట్, ఐఐటీలలో సీటు సాధించేలా ప్రత్యేక శిక్షణ
- యోగా, కరాటేలో శిక్షణ
- ఇంటర్ అనంతరం ఉద్యోగ అవకాశాలు పొందేలా కమ్యూనికేషన్

గురుకుల పాఠశాల విద్యార్థుల విజయాలు

- జగనన్న ఆణిముత్యాలు పథకంలో జిల్లాస్థాయిలో పారితోషకం అందిపుచ్చుకున్నారు.


కలెక్టర్ మాధవీలత, మంత్రి వేణు చేతుల మీదుగా ద్వితీయ బహుమతి అందుకుంటున్న గురుకుల విద్యార్థినులు (ఫైల్)

- శ్రేష్ట నేషనల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచారు.
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా నృత్య ప్రదర్శనలో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు.
- ఇస్రో క్విజ్‌లో శాస్త్రవేత్తల చేతుల మీదుగా బహుమతులు పొందారు.
- కౌశల్ క్విజ్ కాంపిటేషన్‌లో స్టేట్ లెవెల్ బహుమతులు గెలుచుకున్నారు.
- 2021 – 23 బ్యాచ్ ఇంటర్ విద్యార్థినులు హెచ్‌సీఎల్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌కు అర్హత సాధించారు.

ఐదో తరగతికి అర్హతలివే..

- ఎస్సీ, ఎస్టీ బాలికలు 1.09.2011 నుంచి 31.08.2015 మధ్య, మిగిలిన వారు 01.09.2013 నుంచి 31.08.2015 మధ్య జన్మించి ఉండాలి.
- 2022 – 23 విద్యాసంవత్సరంలో 3వ తరగతి, 2023 –24లో నాలుగో తరగతిని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పూర్తి చేసి ఉండాలి.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 2023–24నాటికి రూ.లక్ష మించి ఉండరాదు.
- మొత్తం సీట్లు 80, వాటిలో ఎస్సీలకు 60, బీసీ–సీ 10, ఎస్టీలకు 05, బీసీ– 4, ఇతరులకు –1.

ఇంటర్ ప్రవేశానికి అర్హతలు

- 2023–24లో పదోతరగతి పరీక్ష రాసే విద్యార్థులు మాత్రమే అర్హులు.
- 31.08.24 నాటికి 17 ఏళ్ల నిండి ఉండాలి. ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లలో చదివిన వారికి ఏడాది మినహాయింపు.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉండాలి.
- ఎంపీసీ 40, బైపీసీలో 40 సీట్లు. ఎస్సీలకు 75 శాతం, బీసీ–సీ 12శాతం, ఎస్టీలకు ఆరుశాతం, బీసీలకు 5 శాతం, ఇతరులకు 2 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారు.

మార్చి 10న ప్రవేశ పరీక్ష

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో చేరే విద్యార్థినులకు మార్చి 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, జూనియర్ ఇంటర్‌లో చేరే విద్యార్థినులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం

https://apgpcet.apcfss.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. దరఖాస్తులో ఐదోతరగతిలో చేరే పాఠశాల, కళాశాల వివరాలు నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేశాక పాఠశాలలు/కళాశాలల మార్పు కుదరదు. ప్రవేశపరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ, సీట్ల కేటాయింపు ఉంటుంది. వివరాలను 97017 33321 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఉచితంగా నమోదు

అలాగే దరఖాస్తు చేయదలిచిన వారు అభ్యర్థి పాస్‌పోర్టు ఫొటో, ఆధార్ నకలు, ఐదో తరగతి ప్రవేశం కోసం నాలుగో తరగతి స్టడీ సర్టిఫికెట్, జూనియర్ ఇంటర్‌కు పదో తరగతి స్టడీ సర్టిఫికెట్, ఉపయోగంలో ఉన్న ఫోన్‌తో బొమ్మూరులోని గురుకుల పాఠశాలకు వస్తే ఉచితంగా దరఖాస్తు చేస్తారు. లేకపోతే మీకు సమీపంలోని నెట్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

పేద పిల్లలకు వరం



గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఐదో తరగతిలో చేరితే ఇంటర్ దాకా చదువు, వసతి, అవసరమైన సదుపాయాలు ఉచితంగా ఉంటాయి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఉంటుంది. ఉన్నతమైన కోర్సులో చేరేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఇది పేద పిల్లలకు వరమని చెప్పవచ్చు.

– ఏ.వాణికుమారి, ప్రిన్సిపాల్, గురుకుల బాలికల పాఠశాల/కళాశాల, బొమ్మూరు

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

బిక్కవోలు: మండలంలోని రంగాపురం, ఇల్లపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇల్లపల్లిలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, సచివాలయం, రంగాపురంలో వాటర్ ట్యాంక్ పైపులైన్లతో పాటు రెండు గ్రామాల్లోనూ గ్రాసిం ఇండస్ట్రీస్ సహకారంతో నిర్మించిన కళా వేదికలను సైతం ప్రారంభిస్తారన్నారు.

అయోధ్య, కాశీ యాత్రలకు బస్సు సర్వీసు

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అయోధ్య, కాశీ యాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ యు.రామన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో అరసవిల్లి, పూరీ, కోణార్క్, భువనేశ్వర్, జాజిపూర్, గయ, శిరోగయ బుద్ధగయ, కాశీ, సీతామాడి, ప్రయాగ, అయోధ్య, నైమిశరణ్యం తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చన్నారు. 12 రోజుల పాటు సాగే ఈ యాత్రకు ఒక్కొక్కరికీ రూ.13 వేలు టిక్కెట్టు వసూలు చేస్తున్నట్టు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అల్పాహారం, భోజనం ఉచితంగా అందిస్తారన్నారు. డిపో పరిధిలోని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 62810 70787, 73829 10321 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు సిద్ధం

సీతానగరం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సీపీఐ ఎంఎల్ తరఫున పోటీ చేసేందుకు పలు జిల్లాల్లో అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తానన్నారు. పార్టీ తరఫున నియోజకవర్గంలో 40 వేలకు పైగా రైతులు, రైతు కూలీలు సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పలివెల జ్యోతి, నందమూరి చిట్టిస్వామి, సిద్దె నాగరాజు, సిద్దె రామకృష్ణ, షేక్ మున్నీ, ధారా రామలక్ష్మి, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

లక్ష రుద్రాక్షాభిషేకం ప్రారంభం


కొంకుదురులో పూజలు చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడితల మామిడి వద్ద ఉన్న శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద లక్ష రుద్రాక్షాభిషేకం పూజలు ప్రారంభించారు. అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో తొలిరోజు గోదావరి స్నానం, గణపతి పూజలు, దేవతామూర్తుల ఆరాధన చేశారు. గ్రామానికి చెందిన మల్లిడి శ్రీనివాసరెడ్డి, రేణుకా పద్మ దంపతులు మూడు రోజుల పాటు పూజలు నిర్వహించనున్నారు. పూజల్లో ఎంపీటీసీ కొంకుదురు పీవీ, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నం శ్రీనివాసరెడ్డి, బాబి, మల్లిడి కోదండం బ్రదర్స్ పాల్గొన్నారు.

గోకవరం సొసైటీ అధ్యక్షుడిగా దాసరి చినబాబు

గోకవరం: గోకవరం విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ సీనియర్ నేత దాసరి చినబాబును నియమిస్తూ ఉత్తర్వులు అందాయి. ఇప్పటివరకూ సొసైటీ చైర్మన్‌గా పని చేస్తున్న గాజింగం సత్తిబాబు రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో చినబాబును నియమించారు. సీనియర్ రాజకీయ నేతగా ఉన్న ఆయన గతంలో పలుమార్లు సొసైటీ అధ్యక్షుడిగా, గోకవరం సర్పంచ్‌గా పని చేశారు. ఈనెల 14న ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు తెలియ వచ్చింది.

కట్నం వేధింపులపై కేసు

సీతానగరం: ముగ్గళ్లకు చెందిన పుట్టా కృష్ణ ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త పుట్టా మోహన్, అత్త, మావలు పద్మ, సత్యనారాయణ, ఆడపడుచు, ఆమె భర్త విపుల, శ్రీనివాస్‌పై కట్నం వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. కపిలేశ్వరపురం మండలం టేకుకు చెందిన మోహన్‌తో ప్రియాంకకు 2016లో వివాహమైంది. రెండేళ్ల కాపురం సజావుగా సాగిన అనంతరం కట్నం కోసం ప్రియాంకను శారీరకంగా, మానసికంగా హింసించసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైఎస్సార్ సీపీ నాయకుల బైక్ ర్యాలీ


వీరవరంలో తోట నరసింహంను కలిసి మద్దతు తెలుపుతున్న సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, జోగేశ్వరరావు తదితరులు

గోకవరం: కృష్ణునిపాలెం సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు రౌతు జోగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం కృష్ణునిపాలెం నుంచి కిర్లంపూడి మండలం వీరవరం వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ తోట నరసింహంను నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బైక్ ర్యాలీ చేపట్టారు. ఉదయం సుమారు 200 బైక్‌లపై పార్టీ అభిమానులు వీరవరం చేరుకుని తోట నరసింహంను కలుసుకుని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరగా వారికి నరసింహం పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగ్గంపేటలో తోట నరసింహం గెలుపుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట రాంజీ, సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌ఛార్జి గుల్లా ఏడుకొండలు, సమ్మెటి నాని, దాసరి చినబాబు, వైస్ ఎంపీపీ మైనర్‌బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం–1 పరిధిలో గల పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు చెబుతున్న మాయ మాటలు నమ్మొద్దన్నారు. అబద్ధపు హామీలతో 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 2019 ఎన్నికల్లో పరాజయం పాలై తిరిగి మరోమారు అబద్ధపు హామీలతో ప్రజల ముందుకు వచ్చి మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. టీడీపీ నేతలు చెబుతున్న మోసపూరిత హామీలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగేందుకు మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న పోలింగ్ బూత్ ఇన్‌చార్జ్‌లకు ఓటర్ల జాబితాలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం


లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ

అనపర్తి: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రజారోగ్యానికి సీఎం జగన్ పెద్దపీట వేశారని పెడపర్తి సర్పంచ్, వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నల్లమిల్లి కాంతమ్మ అమ్మిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెడపర్తిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 శిబిరాన్ని సర్పంచ్ కాంతమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన సీఎం జగనన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న ఆరోగ్య సురక్షతో పేదలకు రక్ష కలుగుతోందని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తమలంపూడి మణి, ఉపసర్పంచ్ మల్లిడి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్‌కు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న మల్లిడి శ్రీనివాసరెడ్డి

అనపర్తి: కోల్‌కతాలోని దక్షిణేశ్వర్‌లో ఉన్న రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస విశ్వజనీన మందిరానికి అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి రూ.లక్ష విరాళాన్ని అందించింది. మంగళవారం రాజమహేంద్రవరంలోని రామకృష్ణ మఠంలో జరిగిన కార్యక్రమంలో సమితి సమకూర్చిన రూ.లక్ష చెక్కును మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్‌కు సమితి వ్యవస్థాపక కార్యదర్శి మల్లిడి శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సమితి దాతృత్వాన్ని, సమితి ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దాడి

సీతానగరం: ఉండేశ్వరపురం సర్పంచ్ మాకాల ఈశ్వరుడిపై దాడి చేసి గాయపర్చిన గుమ్మళ్ల మునలయ్య, మబ్బు వెంకట రమణపై కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. మద్యం తాగిన వారిద్దరూ కర్రలతో దాడి చేయడంతో సర్పంచ్ ఈశ్వరుడి ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావమైందన్నారు. అతడిని మెరుగైన వైద్యసేవలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని తెలిపారు.

పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపూడిలో రూ.18.61 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం


పెదపూడిలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పేదలకు 24/7 కార్పొరేట్ వైద్యం అందించాలనేదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడిలో గతంలో ఎన్నడూ లేని విధంగా మంగళవారం ఒక్కరోజే రూ.18.61 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ.5.29 కోట్లతో అభివృద్ధి చేసిన సామాజిక ఆరోగ్యకేంద్రం, రూ.37.50 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు ప్రారంభించారు. మరో రూ.12.35 కోట్లతో ఆధునీకరించనున్న సమగ్ర తాగునీటి సరఫరా పథకం(సీపీడబ్ల్యూఎస్)లో పైపులైన్ ఆధునీకరణ, ఇంటింటి కుళాయి పనులకు శ్రీకారం చుట్టారు. వేండ్ర గ్రామంలో రూ.37 లక్షలతో చేపట్టిన పైపులైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ తదితర పథకాలతో పేదలకు మరింత చేరువలో వైద్య సేవలు అందజేస్తున్నారన్నారు. దీంతో ప్రతి పేదవాడి గుండెలో జగన్ కొలువై ఉన్నారన్నారు. అలాగే ప్రజలకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందజేయాలని మండలంలో జలజీవన్ మిషన పథకంలో సుమారు రూ.20 కోట్లతో తాగునీటి పథకాలు, పైపులైన్ పనులు చేస్తున్నారన్నారు. ప్రజలు జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యేగా తనను, సీఎంగా జగన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను ఆయన అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని కాకర సాయిబాబు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీహెచ్‌ఎస్ సనత్‌కుమారి, కాకినాడ డీసీహెచ్‌ఎస్ ఎస్.స్వప్న, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ టీవీ రమణమూర్తి, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచి కోసూరి వాసు, మార్ని కామరాజు చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, కోరా వీర్రాజు చౌదరి, రాష్ట్ర చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పప్పు సింహాచలం, పార్టీ కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట


కొంకుదురులో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు విజయలక్ష్మి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని కొంకుదురు సర్పంచ్ సత్తి వీరమణి అన్నారు. మంగళవారం కొంకుదురు ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ముందుగా వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించి అనంతరం వారి గ్రామాలకే వైద్య నిపుణులను పంపించి వైద్య సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, మండల పరిషత్ సూపరింటెండెంట్ రత్నకుమార్, పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి, పంచాయతీ సిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలను అరికడతాం


కందే శ్రీనివాసులు, నార్త్ జోన్ డీఎస్పీ

మధురపూడి: ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా నార్త్ జోన్ డీఎస్పీ కందే శ్రీనివాసులు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన ఇటీవల సౌత్‌జోన్ నుంచి నార్త్ జోన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అలాగే ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఎరువుల తనిఖీ

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వలను మంగళవారం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బీకే మల్లికార్జునరావు తనిఖీ చేశారు. కోరుకొండ మండలాధికారి గౌరీదేవి, హబ్ ఏవో రామతులసి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- జక్కంపూడి గణేష్
- నగదు, నిత్యావసరాలు, దుస్తుల వితరణ


బాధితులకు సాయం అందిస్తున్న జక్కంపూడి గణేష్

సీతానగరం: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. నల్గొండలో అగ్ని ప్రమాద బాధితులు బందిలి చిట్టియ్య, బందిలి అప్పన్నలను మంగళవారం ఆయన పరామర్శించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో వారి తాటాకిళ్లు కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితులను గణేష్ పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం, మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలు, నూతన వస్త్రాలు అందించారు. కాలిపోయిన ఇళ్ల పునరుద్ధరణ పనులు చేపట్టాలని పార్టీ నాయకులను ఆదేశించారు. అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పట్టపగలు విష్ణుప్రసాద్, జక్కంపూడి జగపతి, గంగాధర్, పనలపూడి శ్రీను, టి.మహేష్ పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఆర్జేడీ నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

- ఆర్జేడీ నాగమణి
- గతేడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

రంగంపేట: విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆర్జేడీ నాగమణి సూచించారు. మండల పరిధిలోని జి.దొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. అనంతరం జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన బిక్కవోలు మండలం పందలపాక ఉన్నత పాఠశాలకు చెందిన మాడెం దినేష్ వీర గణేష్‌కుమార్‌కు ల్యాప్‌టాప్, ద్వితీయ స్థానం సాధించిన కొవ్వూరు మండలం వాడపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన గునపరెడ్డి సత్య అనూష దుర్గకు డెస్క్‌టాప్ కంప్యూటర్, తృతీయ స్థానం సాధించిన నల్లజర్ల మండలం ప్రకాశరావు పాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అచ్యుత నాగ వెంకట సత్య సూర్యప్రసాద్‌కు డెస్క్‌టాప్ కంప్యూటర్ బహూకరించారు. జి.దొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు, మెడల్స్, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు సమకూర్చిన శ్రీ ఫౌండేషన్ కాళ్ళ శ్రీనుని ఆర్జేడీ నాగమణి అభినందించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖాధికారి ఈవీవీఎస్ఎస్ఎస్‌బీఎల్ నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, ఎంఈఓ మధుసాధనరావు, మండల జేఏసీ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, హెచ్‌ఎం కేవీ రమణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.